సాక్షి
అనంతపురం
ఆదివారం । 31 । మార్చి । 2024

థ్యాంక్యూ సార్..
మా కలలను నిజం చేశారు.
విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు పొందిన విద్యార్థుల కృతజ్ఞత



అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

శనివారం రాత్రి అనంతపురం తపోవనం సర్కిల్‌లో సీఎం వైఎస్ జగన్ బస్సుయాత్రకు పోటెత్తిన జనం



జైత్రయాత్రలో జన తరంగం

42 డిగ్రీల ప్రచండ భానుడి ఉగ్రరూపం.. అభిమానం ముందు మంచుముద్దలా కరిగిపోయింది. అక్కచెల్లెమ్మల ఆశీర్వాదం..అవ్వాతాతల దీవెనలు, అన్నదమ్ముల ఆదరణ మధ్య సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర నాలుగో రోజు శనివారం జిల్లాలో కొనసాగింది. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ కలిసి అడుగులో అడుగువేస్తూ కదిలివచ్చారు. అనంత మనవడికి అపూర్వ స్వాగతం పలికారు. విద్యార్థులు, యువకులు, మహిళలు, శ్రమజీవులు... ఇలా ఒకరేమిటి అన్ని వర్గాలు ఏకమై...అభిమాన నేతకు హారతులు పట్టారు. ప్రతి గొంతుకా జగన్నినాదం చేయగా అనంత ప్రతి ధ్వనించింది. యువకులు జగన్ పాటలకు చిందులేస్తూ సందడి చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, వచ్చిన మార్పులను గుర్తు చేస్తూ జగన్ ముందుకు సాగారు. శనివారం సాయంత్రం బసినేపల్లిలో జిల్లాలోకి ప్రవేశించిన 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర గుత్తి, పామిడి, కల్లూరు, అనంతపురం, రాప్తాడు, ఎస్కేయూ మీదుగా సంజీవపురం వరకూ సాగింది.


వెల్‌కం సార్: బసినేపల్లిలో గుమ్మడికాయతో హారతి పట్టి జిల్లాలోకి స్వాగతం


గుత్తి కిటకిట: రోడ్‌లో పాల్గొన్న అశేష జన వాహిని


మిద్దెలెక్కిన అభిమానం: జగన్‌ను చూసేందుకు గుత్తిలో మిద్దెలెక్కిన జనం


అభిమాన సంద్రం: మిడుతూరులో అభిమాన తరంగం


కల్లూరులో జనవాహిని మధ్య జగన్ రోడ్ షో


జగన్నినాదం: రాప్తాడు సర్కిల్‌లో 'జై జగన్' అంటూ నినదిస్తున్న అభిమానులు

- సీఎం జగన్‌కు అడుగడుగునా జనం నీరాజనం
- జనంతో కిక్కిరిసిన అనంత రహదారులు
- గుత్తి నుంచి రాప్తాడు వరకూ ఉప్పొంగిన ఉత్సాహం
- జాతీయ రహదారిలో పల్లెపల్లెనా పూలు చల్లి జేజేలు
- అనంతపురం జిల్లాలో 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు బ్రహ్మరథం
- రాత్రి బత్తలపల్లి మండలం సంజీవపురం వద్ద బస చేసిన జగన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎన్నికల వేళ జైత్రయాత్ర చేపట్టిన జననేత జగన్‌మోహన్‌రెడ్డికి అనంత ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది. పూలజల్లు కురిపిస్తూ అభిమానం చూపింది. శనివారం 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనంతపురం జిల్లాలో అడుగు పెట్టారు. గుంతకల్లు నియోజకవర్గం గుత్తికి సమీపంలోని బసినేపల్లి నుంచి చేపట్టిన రోడ్ షో తాడిపత్రి, శింగనమల, అనంతపురం, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో సాగింది.

బసినేపల్లిలో ఘన స్వాగతం

షెడ్యూల్ ప్రకారం ఉదయమే గుత్తికి చేరుకోవాల్సిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రోడ్‌షో... ప్రజాభిమానం గ్రామగ్రామానా అడ్డుకోవడంతో శనివారం ఆలస్యంగా నడిచింది. దీంతో మధ్యాహ్నం 3 గంటలకు గుత్తి సమీపంలోని బసినేపల్లికి చేరుకుంది. బసినేపల్లి గ్రామ శివారులో గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి శంకరనారాయణ, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, శ్రీదేవి, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖితతో పాటుగా పార్టీ నాయకులు స్వాగతం పలికారు. ఉదయమే బసినేపల్లికి చేరుకున్న అభిమానులు జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే వరకూ మండుటెండలోనే ఎదురుచూశారు. అభిమాన నేతను చూసి ఆనందంతో కేరింతలు కొట్టారు. బసినేపల్లి నుంచి దారి పొడవునా మహిళలు రోడ్డుకు ఇరువైపులా నిల్చొని పూల వర్షం కురిపించారు. అక్కడినుంచి గుత్తిలోకి చేరేసరికి సాయంత్రం నాలుగు దాటింది.

అభిమాన తరంగంతో పోటెత్తిన గుత్తి

గుత్తిలోని రహదారులన్నీ జనంతో కిక్కిరిసి పోయాయి. అభిమాన నేతకు మహిళలు అడుగడుగునా గుమ్మడి కాయలతో హారతులు ఇచ్చారు. దారి పొడవునా పూలు చల్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. బస్సుయాత్ర ముందు నృత్యాలు చేస్తూ ఉత్సాహంతో ముందుకు సాగారు. గుత్తి ప్రభుత్వాసుపత్రి వద్ద నుంచి బస్సుపైకి ఎక్కిన సీఎం వైఎస్ జగన్ అభివాదం చేస్తూ చక్కటి చిరునవ్వుతో అందరినీ పలకరించారు. ఎన్టీఆర్ సర్కిల్, గాంధీ సర్కిల్ వద్ద భారీగా చేరుకున్న అభిమానులు బస్సు ముందుకు కదలకుండా అడ్డుపడ్డారు. మిద్దెలు, కాంప్లెక్స్‌లు పైకి ఎక్కి తమ అభిమాన నాయకుడు జగన్‌ను చూసి మురిసిపోయారు. ప్రతి చోట పూల వర్షం కురిపించారు. ఎక్కడ చూసినా సందడి, కోలాహలమే కనిపించింది.

భోజనం కూడా చేయకుండానే

వాస్తవానికి మధ్యాహ్నం 2 గంటలకు గుత్తి శివారులోని ఎస్‌కేడీ కళాశాల వద్ద భోజన విడిది ఏర్పాటు చేశారు. కానీ పల్లె పల్లెనా జనం భారీగా తరలిరావడంతో రోడ్‌షో ఆలస్యమైంది. దీంతో సీఎం జగన్ భోజనం చేయకుండానే రోడ్ షో కొనసాగించారు. గుత్తి శివారులో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు తమ అభిమానాన్ని చాటుకుంటూ జగన్‌కు జేజేలు పలికారు. ఎస్కేడీ కళాశాల వద్ద జగన్‌తో సెల్ఫీలు దిగడానికి జనం ఎగబడ్డారు. బసినేపల్లి నుంచి గుత్తి ఎస్కేడీ కళాశాల మధ్య దూరం కేవలం ఏడు కిలోమీటర్లు. అయినా రోడ్‌షో రెండున్నర గంటల సమయం తీసుకుందంటే అభిమానుల తాకిడి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మిడుతూరులో అపూర్వ ఆదరణ

గుత్తి నుంచి ప్రారంభమైన రోడ్‌షో మిడుతూరు గ్రామం చేరుకుంది. అక్కడ తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో వేలాది మంది ప్రజలు, అభిమానులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం పలికారు. 'జై జగన్' అంటూ నినదించారు.

పామిడిలో పూలవర్షం

అభిమానుల ఆదరణ మధ్య మిడుతూరు నుంచి ప్రారంభమైన సీఎం వైఎస్ జగన్ బస్సుయాత్ర గజరాంపల్లి, పొగరూరు మీదుగా రాత్రి 7.10 గంటలకు పామిడికి చేరుకుంది. పామిడి హైవేపై వైజంక్షన్ నుంచి హనుమాన్ లింకు రోడ్డు క్రాస్ వరకూ సీఎం రోడ్‌షో సాగింది. ఈ సందర్భంగా అభిమానులు జననేతపై పూలవర్షం కురిపించారు. తనకోసం గంటల తరబడి రోడ్డుపైనే వేచి ఉన్న కొందరు అభిమానులతో సీఎం జగన్ సెల్ఫీ దిగి వారిని ఆనందపరిచారు. జగన్‌ను చూడగానే మహిళలు, పిల్లలు కేరింతలు కొట్టారు. యువత, అభిమానులు పార్టీ జెండాల చేబూని కల్లూరు క్రాస్‌కు వరకూ బస్సు వెంట పరుగులు తీశారు.

కల్లూరులో కదం తొక్కిన అభిమానం

గార్లదిన్నె మండలం కల్లూరులో అభిమానులు కదం తొక్కారు. శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరి సాంబశివారెడ్డి, మంత్రి ఉషశ్రీ చరణ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అపూర్వ స్వాగతం పలికారు. కల్లూరు జాతీయ రహదారిపై వేలాది మంది ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు బారులు తీరడంతో సీఎం జగన్ బస్సు పైకి ఎక్కి వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. తలగాచిపల్లి, గార్లదిన్నెల్లో కూడా మహిళలు అధిక సంఖ్యలో రోడ్లపైకి రావడంతో బస్సులోంచే వైఎస్ జగన్ ప్రజలకు అభివాదం చేశారు. అక్కడి నుంచి బస్సుయాత్ర వడియంపేట, బాట్లో కొత్తపల్లి గ్రామాల మీదుగా సాగింది.

టిప్పర్ డ్రైవర్ వీరాకే మా మద్దతు

కల్లూరు, గార్లదిన్నెలలో కొందరు అభిమానులు శింగనమల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులకే మా మద్దతు అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. 'చంద్రబాబూ నీ బండి నడిపేది డ్రైవరే... నీ రాజకీయ బండి ఆపేది కూడా డ్రైవర్లే.. ఖబడ్దార్' అంటూ కార్యకర్తలు భారీ సంఖ్యలో ప్లకార్డులు పట్టుకొని జగన్నినాదం చేశారు.

రాప్తాడులో అపూర్వ స్వాగతం

సీఎం జగన్ బస్సుయాత్ర రాప్తాడు చేరుకునే సరికి రాత్రి 10.26 గంటలైంది. అప్పటికే అక్కడ వేచి చూస్తున్న నియోజకవర్గంలోని ఆరు మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు పూలు చల్లి సీఎం జగన్‌పై అభిమానం చూపారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, ఎమ్మెల్యే సోదరులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు నియోజకవర్గ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అభిమానులు 'జై జగన్' అంటూ నినాదాలు చేయడంతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. అనంతరం ధర్మవరం పంగల్ రోడ్డు మీదుగా అనంతపురం రూరల్ మండలంలోని ఆకుతోటపల్లి, ఎస్కేయూ మీదుగా శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లికి సమీపంలోని సంజీవపురం వద్దకు బస్సుయాత్ర చేరుకుంది.

సంజీవపురం వద్ద బస

శనివారం 75 కిలోమీటర్ల మేర జగన్ బస్సుయాత్ర కొనసాగింది. ప్రతి పల్లెలోనూ వైఎస్సార్ సీపీ జెండాలతో యువత ఉత్సాహంగా కనిపించారు. రాత్రి 11.45 గంటల సమయంలో బత్తలపల్లికి సమీపంలోని సంజీవపురం వద్ద బస చేశారు. బస్సు యాత్రలో ముఖ్యమంత్రి వెంట ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులు, జిల్లా అధ్యక్షులు, పలువురు నాయకులు ఉన్నారు.

అభిమానం 'అనంతం'

జగన్ రోడ్‌షో సందర్భంగా శనివారం రాత్రి అనంతపురం జనసాగరమైంది. రాత్రి 9.30 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్రగా తపోవనం సర్కిల్‌కు చేరుకోగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నాయకత్వంలో భారీ గజమాలతో అభిమానులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, శంకరనారాయణ, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు కూడా బస్సుపైకి చేరుకుని సీఎంతో పాటు ప్రజలకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మైనార్టీల తరఫున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టోపీ, చాదర్‌తో సత్కరించారు. అప్పటికే అక్కడ భారీగా చేరుకున్న జనం పెద్ద ఎత్తున ఈలలు, కేకలు వేస్తూ..జై జగన్ అంటూ నినాదాలు చేశారు. కనుచూపు మేర పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు హైవేకి ఇరువైపులా వేచి ఉన్నారు. ఆ సర్కిల్‌లో మిద్దెలపై ఎక్కి ప్రజలు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని చూసేందుకు ఎగబడ్డారు. దాదాపుగా 16 నిమిషాల పాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తపోవనం సర్కిల్‌లో ఉండి ప్రజలకు అభివాదం చేశారు. తమ అభిమాన నాయకుడిని చూసేందుకు జనం ఎగబడ్డారు. సెల్‌ఫోన్‌లో సీఎం ఫొటోను బంధించి ఆనంద పడ్డారు.


అభివందనం: తనను చూసి జై కొడుతున్న అభిమానులకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్


నీరాక కోసం: వడియంపేటలో జాతీయ రహదారిపై జగనన్న కోసం వేచి చూస్తున్న అభిమానులు

పల్లెలన్నీ జాతీయ రహదారిపైనే

కాశేపల్లి టోల్ గేట్‌నుంచి మొదలుపెడితే రాప్తాడు వరకూ పల్లెలన్నీ జాతీయ రహదారిపైకి తరలివచ్చాయి. మిడ్తూరు, గజరాంపల్లి, పొగరూరు, కల్లూరు, పామిడి ఇలా ఒకటేమిటి ప్రతి గ్రామంలోనూ వేలాదిమంది అభిమానులు రోడ్డుపైనే గంటల తరబడి తమ అభిమాన నేతకోసం వేచిచూశారు. జగన్‌ను చూసి సంబరపడ్డారు. కల్లూరు, అనంతపురం తపోవనం వద్ద క్రేన్‌ల సాయంతో గజమాలలతో జిల్లా మనవడికి పుష్పాభిషేకం చేశారు.




మిడుతూరులో జన నీరాజనం నడుమ సాగుతున్న సీఎం జగన్ బస్సుయాత్ర


గుత్తిలో ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి


కల్లూరులో సీఎం జగన్‌కు హారతి ఇస్తున్న మహిళ


అదిగో జగనన్న..

అడుగడుగునా నీరాజనం


రాప్తాడులో ప్రజలకు అభివాదం

పల్లె పులకించింది. సంక్షేమ సారథికి నీరాజనాలు పలికింది. విజయోస్తు అంటూ మనసారా ఆశీర్వదించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర శనివారం జిల్లాకు చేరుకుంది. గుత్తి మొదలు రాప్తాడు వరకూ అడుగడుగునా సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పూల వర్షం కురిపించారు. జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. జననేతను చూసిన చిన్నాపెద్ద మురిసిపోయారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


నీవే మా భరోసా..


నీ బంగారు భవిష్యత్తు.. నా బాధ్యత


గుత్తిలో సంక్షేమ సారథిపై పూల వర్షం కురిపిస్తున్న జనం

టీడీపీకి కోలుకోలేని దెబ్బ

- వైఎస్సార్‌సీపీలో చేరిన కళ్యాణదుర్గం నేత ఉమా మహేశ్వరనాయుడు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో కండువా వేసుకున్న ఉమా
- ఆయనతో పాటు ముఖ్య నేతలూ వైఎస్సార్ సీపీలోకి..


ఉమామహేశ్వరనాయుడుకు పార్టీ కండువా వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో తెలుగుదేశం పార్టీకి భారీ దెబ్బ తగిలింది. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన కీలక నేత మాదినేని ఉమా మహేశ్వరనాయుడు శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల వేళ ఉమామహేశ్వరనాయుడు టీడీపీని వీడటం ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గడిచిన ఇరవై ఏళ్లుగా ఆయన టీడీపీలో కీలక నేతగా వ్యవహరించారు.

దబ్బు కోసం సీట్లు అమ్ముకున్నందుకే..

ఉమామహేశ్వర నాయుడు 2019 ఎన్నికల్లో కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2024 ఎన్నికల్లోనూ ఆయన తిరిగి టీడీపీ నుంచే పోటీ చేయాలని భావించారు. నియోజకవర్గంలో పార్టీకి కష్టపడి పని చేశారు. అయితే.. బాగా డబ్బున్న ఎస్ఆర్‌సీ నిర్మాణసంస్థ అధినేత అమిలినేని సురేంద్రబాబుకు టీడీపీ టికెట్ ఇచ్చారు. నియోజకవర్గంతో ఏ మాత్రమూ పరిచయం లేని ఆయనకు టికెట్ ఇవ్వడంతో టీడీపీ శ్రేణులు ఆందోళన చేశాయి. ఇక్కడ ఉమామహేశ్వరనాయుడు, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి వర్గాలు కీలకమైనవి. తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా కలసి పనిచేస్తామని ప్రకటించినప్పటికీ.. వారిని కాదని అమిలినేనికి ఇచ్చారు. దీంతో ఉమా, ఉన్నం వర్గాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ క్రమంలోనే కొన్ని రోజులుగా టీడీపీకి దూరంగా ఉన్న ఉమామహేశ్వరనాయుడు శనివారం 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉమాతో పాటు కళ్యాణదుర్గం మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ దొడగట్ట నారాయణ, మాజీ ఎంపీపీ, ప్రస్తుత టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ కొల్లప్ప, కళ్యాణదుర్గం క్లస్టర్ ఇన్‌చార్జ్ తలారి సత్యప్ప, కంబదూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పోలార్పు ఆనంద్ చౌదరి, కళ్యాణదుర్గం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బిక్కి గోవిందరాజులు, రూరల్ మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, శెట్టూరు మండల ప్రధాన కార్యదర్శి ఆదిశేషు, కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామ ఎంపీటీసీ ఓబయ్య, మాజీ మండల కన్వీనర్ రంగనాథ్ శెట్టి, తోపూరి మంజునాథ్ చౌదరి, తిమ్మసముద్రం వెంకటేశులుకు కూడా సీఎం వైఎస్ జగన్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

అసలే అసంతృప్తులు.. ఆపై టీడీపీకి గుడ్‌బై

అనంతపురం జిల్లా టీడీపీలో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ఈ దశలో పార్టీని వీడుతున్న వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. దీంతో టీడీపీకి దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతోంది. అనంతపురం అర్బన్ నేత ప్రభాకర్ చౌదరి, గుంతకల్లు నేత జితేందర్‌గౌడ్ కూడా రేపోమాపో తమ నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. కళ్యాణదుర్గంలో ఉన్నం వర్గం పార్టీకి దూరంగా ఉంటోంది. మొన్న చంద్రబాబు పర్యటనలో కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా పాల్గొనలేదు. కీలక నేతలు దూరమవుతుండటంతో టీడీపీ కేడర్‌లోనూ గందరగోళం నెలకొంది. నామినేషన్లలోపు మరెన్ని కీలక పరిణామాలు చోటు చేసుకుంటాయోనన్న ఆందోళన ఆ పార్టీలో కలుగుతోంది.

వైఎస్సార్ సీపీలోకి గుంతకల్లు ప్రముఖులు


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం వైఎస్ జగన్, చిత్రంలో ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు కూడా వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు, మాజీ ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు గోపా జగదీష్, మాజీ కౌన్సిలర్ పాండు, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మన్సూర్, ప్రముఖ వ్యాపారవేత్త రమేష్ తదితరులకు ఎస్‌కేడీ కళాశాల వద్ద సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే వైవీఆర్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, గుంతకల్లు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే వైవీఆర్ చేసిన కృషికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు.



నీటి వినియోగంపై అవగాహన కల్పించండి

గార్లదిన్నె/పామిడి: వేసవి నేపథ్యంలో నీటి సమర్థ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. శనివారం గార్లదిన్నెలోని పశువుల ఆస్పత్రి, కల్లూరు పెన్నానదిలో తాగునీటి పథకాలకు సంబంధించి బోర్లతో పాటు పామిడిలోని సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ పంప్ హౌస్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 'సేవ్ వాటర్ క్యాంపెయిన్' చేపట్టాలని అధికారులకు సూచించారు. బోర్లు, పంపు సెట్ల మరమ్మతులు చేయించాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులు నెలకు మూడు సార్లు శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ భాష, డీపీఓ ప్రభాకర్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్ కుమార్, ఎంపీడీఓ వెంకట లక్ష్మి, ఏఈ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు అలుకోత్సవం


అశ్వవాహనంపై నృసింహుడు (ఫైల్)

కదిరి: బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు భక్తులకు అశ్వవాహనంపై తిరువీధుల్లో దర్శనమిస్తారు. అంతకు మునుపు యాగశాలలో నిత్యహోమం గావించి శ్రీవారిని విశేషంగా అలంకరించి రాత్రి 7 గంటల సమయంలో ఆలయం పక్కనే ఉన్న అలుకోత్సవ మంటపం వద్దకు తీసుకొస్తారు. అక్కడ అలుకోత్సవ విశిష్టతను ఆలయ అర్చకులు భక్తులకు వివరిస్తారు.

కణేకల్లు క్రాస్‌లో దొంగల బీభత్సం

కణేకల్లు: దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. ఊరిబయట ఉన్న ఇంటిని లక్ష్యంగా చేసుకుని పథకం ప్రకారం దోపిడీ చేశారు. నాటుతుపాకులు, కత్తులతో బెదిరించి ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదుతో ఉడాయించారు. వివరాలిలా ఉన్నాయి. కణేకల్లు క్రాస్‌లో ఊరిబయట తిప్పారెడ్డి ఇల్లు ఉంది. ఈ ఇంటికి చుట్టు పక్కల ఏ ఇళ్లూ లేవు. ఇదే అదనుగా భావించిన దుండగులు ముందుగా రెక్కీ నిర్వహించారు. శనివారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో తిప్పారెడ్డి తల్లి శంకరమ్మ, భార్య శారద ఇంట్లో టీవీ చూస్తున్నారు. తిప్పారెడ్డి తన స్నేహితుడు పురుషోత్తంరెడ్డితో కలిసి ఇంటి వసారాలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఒక్కసారిగా మూడు బైక్‌లు రయ్‌మంటూ వచ్చాయి. అందులో మాస్కులు ధరించిన ఆరుగురు వ్యక్తులు నాటు తుపాకులు, కత్తులతో బెదిరించి ఇంట్లోకి ప్రవేశించారు. మీ ఒంటిపై ఉన్న ఆభరణాలివ్వాలంటూ డిమాండ్ చేశారు. మీరెవరని పురుషోత్తం రెడ్డి, స్నేహితుడు ఆరా తీయగా.. చెప్పింది చేయకపోతే చస్తారంటూ మారణాయుధాలతో బెదిరించారు. భయంతో వణికిపోయిన శారద తన మెడలో ఉన్న బంగారు చైన్, కమ్మలు ఇవ్వగా.. అత్త శంకరమ్మ మెడలో ఉన్న చైన్ తీసిచ్చింది. పురుషోత్తంరెడ్డి తన చేతిలో ఉన్న గోల్డ్ రింగ్‌తోపాటు రూ.20వేల నగదును ఇచ్చేశాడు. అనంతరం వారందరినీ దుండగులు బెడ్ రూమ్‌లో వేసి గడియపెట్టారు. ఇంట్లో ఉన్న బీరువాలో వెదకగా రూ.20వేల నగదు దొరికింది. తర్వాత కబోర్డులు, రహస్య ప్రదేశాలు వెదికి, దుస్తులు, సామాన్లు చెల్లాచెదురుగా పడేశారు. దుండగులు అక్కడి నుంచి వెళ్లే సమయంలో ఎక్కడ తమను వెంబడిస్తారోనని ఇంటి ఆవరణలో నిలిపిన తిప్పారెడ్డి బైక్ హెడ్‌లైట్లు ధ్వంసం చేశారు. లోపల గదిలో ఉండిపోయిన తిప్పారెడ్డి కుటుంబ సభ్యులు గట్టిగా కేకలు వేస్తూనే ఉన్నారు. చాలాసేపటికి పొలానికి వెళ్తున్న ఓ రైతు సంఘటన స్థలానికి వచ్చి తలుపు గడియ తీశారు. బాధితులు బయటకు వచ్చి పోలీసులకు సమాచారమందించారు. రూ.40 వేల నగదు, పది తులాల దాకా బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారని తెలిపారు. దుండగుల్లో ఇద్దరు తెలుగు, మరో నలుగురు హిందీ భాషలో మాట్లాడినట్లు చెప్పారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, దొంగల కోసం గాలింపు చేపట్టారు.

'ఎడిఫై' స్కూల్‌లో చేర్చొద్దు

అనంతపురం ఎడ్యుకేషన్: బుక్కరాయసముద్రం మండలం వడియంపేట సమీపంలోని 'ఎడిఫై' స్కూల్‌కు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవని జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్కూల్ యాజమాన్యం 1 నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని డీఈఓ వెల్లడించారు. పాఠశాల ప్రారంభించేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనమతి పొందలేదన్నారు. పిల్లలను చేర్పించొద్దన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో మాత్రమే పిల్లలను చేర్పించాలని డీఈఓ స్పష్టం చేశారు.

నమో నారసింహా..




భక్తులకు దర్శనమిస్తున్న లక్ష్మీనారసింహుడు, చల్లగా చూడు స్వామీ అంటూ వేడుకుంటున్న భక్తులు

- వైభవంగా నృసింహుని బ్రహ్మ రథోత్సవం

కదిరి: శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనారసింహుని బ్రహ్మ రథోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది.' నమో నారసింహా..' నామస్మరణతో కదిరి తిరువీధులు మార్మోగాయి. బ్రహ్మ రథం ప్రారంభించేందుకు ఉదయం 7.20 నుంచి 8.10 గంటల మధ్య శుభ సమయంగా ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు నిర్ణయించారు. అయితే రథం సరిగ్గా ఉదయం 8.12 గంటలకు ముందుకు కదిలింది. మధ్యాహ్నం 12.54 గంటలకు బ్రహ్మ రథం యథాస్థానం చేరుకుంది. అక్కడక్కడా రథం పలు ఇళ్లతో పాటు విద్యుత్ స్తంభాలను తాకుతూ వచ్చింది. ఎంజీ రోడ్ సర్కిల్‌తో పాటు హిందూపూర్ సర్కిల్‌లో మాత్రమే రథం కొద్ది సమయం ఆగింది. మొత్తం మీద ఈసారి తేరు త్వరగానే యథాస్థానం చేరుకుంది.

రథోత్సవంలో ప్రముఖులు..

ఉదయాన్నే ఆలయ అర్చక బృందం తేరు ముందు బలిహరణం, ఆస్థాన పూజలు నిర్వహించింది. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బి.ఎస్.మక్బూల్ అహ్మద్, సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి ఇంకా పలువురు నాయకులు రథోత్సవంలో పాల్గొన్నారు. ఈఓ శ్రీనివాసరెడ్డి రథం వద్ద జరిగిన బలిహరణం పూజల్లో పాల్గొని రథం యాథాస్థానం చేరుకునే వరకూ ఉన్నారు. తిరు వీధుల అక్రమణల కారణంగా బ్రహ్మరథం లాగేందుకు భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. ఎండలు మండిపోతున్నా భక్తులు ఏమాత్రం లెక్కచేయకుండా తమ ఇలవేల్పును దర్శించుకొని రథంపైకి దవణం, మిరియాలు చల్లేందుకు తిరువీధుల్లోని మిద్దెలపై వేచి ఉన్నారు. అలా రథంపైకి దవణం, మిరియాలు చల్లితే పాప విముక్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి ఎప్పటిలాగానే రథంపై నిల్చొని రథ కదలికలను మైకు ద్వారా తెలియజేస్తూ ఆద్యంతం 'శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి గోవిందా..గోవింద, ప్రహ్లాద వరద గోవిందా..గోవిందా, జయ జయ సింహా..జయ నరసింహా' అంటూ భక్తులతో గోవింద నామాన్ని పలికించారు.

- ముందురోజు అంటే శుక్రవారం రాత్రి ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు ఐరావతంపై తిరు వీధుల గుండా భక్తులకు దర్శనమిచ్చి తిరిగి ఆలయం చేరుకొని, తెల్లవారు జామున శుభ ఘడియల్లో రథారోహణం గావించారు.
- ఆనవాయితీగా వస్తున్న మూర్తిపల్లి, బేరిపల్లి, కుటాగుళ్ల, నాగిరెడ్డిపల్లి, గంగిరెడ్డిపల్లి గ్రామస్తులు రథానికి సంద్ర మొద్దులు, తెడ్లు వేస్తూ రథ గమనాన్ని నియంత్రిస్తుంటే పెద్ద సంఖ్యలో భక్తులు బ్రహ్మ రథాన్ని లాగారు. రథం ముందు వెళ్తుంటే వెనుక భాగాన ఫైర్ ఇంజిన్‌తో పాటు ప్రథమ చికిత్సకు సంబంధించిన అంబులెన్స్ వాహనాలు వెళ్లాయి. కదిరి డీఎస్పీ శ్రీలత నేతృత్వంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


లక్ష్మీనరసింహస్వామి తేరును లాగుతున్న అశేష భక్తజనం

క్లుప్తంగా

రోడ్‌షోకు తరలిన నాయకులు



బి.యాలేరు నుంచి తరలివెళ్తున్న అభిమానులు

ఆత్మకూరు: మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర శనివారం అనంతపురం జిల్లాలో ప్రవేశించింది. అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల మీదుగా జరిగిన రోడ్‌షోకు మండలం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, అభిమానులు తరలివెళ్లారు. ఓ వైపు ఎండలు భగభగమంటున్నా ఆ ఎండల వేడిని సైతం లెక్కచేయకుండా సీఎం జగన్‌ను చూసేందుకు మండలం నుంచి బస్సులు, ప్రైవేటు వాహనాల్లో పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

రేషన్ డీలర్ సస్పెన్షన్

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియామవళి ఉల్లంఘించిన వారిపై కలెక్టర్ గౌతమి చర్యలు తీసుకున్నారు. వజ్రకరూరు మండలం గడేహోతూరు గ్రామానికి చెందిన చౌక దుకాణపు డీలర్ ఎస్.నాగరాజును శనివారం సస్పెండ్ చేశారు. ఇప్పటి వరకూ 40 మంది వలంటీర్లు, ఏడుగురు డీలర్లు, ఒక ఎండీయూ ఆపరేటర్, 11 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, ఒక పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్‌కు గురయ్యారు.

కళ్లద్దాల పంపిణీ

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీ సెంటర్‌లో దృష్టిలోపంతో బాధపడుతున్న 55 మంది చిన్నారులకు సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ శనివారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. తాళంకి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. తాళంకి ట్రస్టు సేవా దృక్పథం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ నిర్వహణధికారి డాక్టర్ నారాయణ స్వామి, డీఈఐసీ మేనేజర్ రజిత, తాళంకి ట్రస్టు శ్రీధర్ పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

రాప్తాడు: యువత ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని రాప్తాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత బాబు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని హంపాపురం గ్రామ సమీపంలోని ఎస్‌వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు నీ ఓటు నీ భవిష్యత్తుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ.. యువత ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలన్నారు. ఉద్యోగులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీతారాం, నోడల్ ఆఫీసర్ నల్లప్ప, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వెన్నపూస రమాకాంత్ రెడ్డి, ప్రిన్సిపల్ విష్ణువర్ధన్, ఏఓ వి.వి.శివా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు నీరాజనం

- రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు
- జై జగన్ నినాదాలతో యువత సందడి



తపోవనంలో అశేష జనవాహిని మధ్య సాగుతున్న సీఎం జగన్ రోడ్‌షో

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం జిల్లా కేంద్రానికి విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అనంతపురం నియోజకవర్గం ప్రజలు ఘనస్వాగతం పలికారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం బస్సుయాత్రలో భాగంగా శనివారం రాత్రి 9:30 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తపోవనం సర్కిల్‌కు చేరుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు అభివాదం చేయడంతో.. పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున ఈలలు, కేకలు వేస్తూ.. జై జగన్ అంటూ చేసిన నినాదాలతో తపోవనం సర్కిల్ హోరెత్తింది. దాదాపుగా 16 నిమిషాల పాటు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తపోవనం సర్కిల్‌లో ఉండి ప్రజలను అభివాదం చేశారు. తపోవనం సర్కిల్‌లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నాయకత్వంలో భారీ గజమాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి స్వాగతం పలికారు. బస్సుపై సీఎం వెంట ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, శంకర్‌నారాయణ, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ ఉన్నారు.

టోపీ, చాదర్‌తో సీఎంను సత్కరించిన ఎమ్మెల్యే 'అనంత'

మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్ తదితర మైనార్టీ నాయకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చాదర్(రుమాలు), టోపీ అందించాలని చూశారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకుల రద్దీ కారణంగా మైనార్టీల తరపున ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని టోపీ, చాదర్‌తో సత్కరించారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్ సీఎంకు రుమాలు వేశారు.

రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కుల సంఘాల మద్దతు

బస్సు యాత్రకు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కుల సంఘాల నాయకులు, యువత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మద్దతుగా వచ్చారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఫయాజ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, సైపుల్లాబేగ్, కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీదేవి, కృష్ణవేణి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, సంపంగి రామాంజినేయులు, టీవీ చంద్రమోహన్ రెడ్డి, రహంతుల్లా, జయలలిత, లీలావతి, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, డైరెక్టర్ శోభారాణి, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, చింతకుంట మధు, కృష్ణమూర్తి, నాగార్జున రెడ్డి, రామకృష్ణ, భారతి, శోభాబాయి, గౌరి, అంజలి, ఉష, భానుమతి, సుజాత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన అభిమానం

రాప్తాడు: మండలంలోని 44వ జాతీయ రహదారి ప్రసన్నాయపల్లి రోడ్డు మీదుగా బస్సుయాత్ర రాప్తాడుకు చేరుకోవడంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, ఎమ్మెల్యే సోదరులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి, నియోజకవర్గ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. పండమేరు బ్రిడ్జి మీదుగా బస్సు యాత్ర రాప్తాడులోకి రావడంతో పండమేరు బ్రిడ్జి నుంచి వైఎస్సార్ సర్కిల్లోని 4 రోడ్ల వరకూ రోడ్డుకు ఇరు వైపులా భారీ ఎత్తున మహిళలు, ప్రజలు రోడ్డుపై కొచ్చి తమ అభిమాన నాయకుడిని చూసేందుకు ఎగబడ్డారు. అక్కడ సీఎం జగన్ మహిళలతో కరచాలనం చేశారు. బస్సుయాత్ర వైఎస్సార్ సర్కిల్ మీదుగా స్థానిక పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకోగా.. జై జగన్.. జైజై జగన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతపురం రూరల్ మండలంలోని ఉప్పరపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసులు బెంగళూరు నుంచి తెప్పించిన బొకేను జేసీబీతో జగన్‌కు అందించారు. రాప్తాడు వద్ద ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 10 వేల మంది సీఎం జగన్‌కు స్వాగతం పలికారు. అనంతరం ధర్మవరం పంగల్ రోడ్డు మీదుగా అనంతపురం రూరల్ మండలంలోని ఆకుతోటపల్లి గ్రామంలోకి బస్సుయాత్ర చేరుకుంది.



రాప్తాడులో క్రేన్ ద్వారా బొకే అందజేస్తున్న దృశ్యం



వైఎస్సార్‌సీపీ జెండాలతో ఫ్లెక్సీ హోర్డింగ్స్ ఎక్కిన అభిమానులు



వైఎస్సార్‌సీపీ జెండాలతో మహిళల సందడి



సీఎం జగన్‌ను సత్కరిస్తున్న ఫయాజ్ బాషా



పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కుల సంఘాల మద్దతు



రాప్తాడులో నృత్యం చేస్తున్న మహిళలు



మేయర్ వసీం ఆధ్వర్యంలో జై జగన్ నినాదాలు



రాప్తాడులో సీఎం జగన్‌ను చూసేందుకు తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు



రాజీవ్‌కాలనీ వద్ద భారీ గజమాలతో సీఎం జగన్‌కు ఘన స్వాగతం

ఘనంగా మహిళా మహోత్సవం



సేవలందించిన మహిళలను సన్మానించిన దృశ్యం

అనంతపురం కల్చరల్: ప్రతి రంగంలో ప్రతిభను కనపరుస్తూ ఆదర్శంగా నిలుస్తున్న మహిళలు సహజంగా శక్తివంతులని పలువురు మహిళానేతలు అన్నారు. శనివారం రాత్రి స్థానిక కమలా నగర్‌లోని రోటరీక్లబ్ ప్రాంగణంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా మహోత్సవం ఘనంగా జరిగింది. ఆద్యంతం ఆటపాటలతో, సాంస్కృతిక సంబరాలతో హోరెత్తించారు. సీడబ్ల్యూసీ చైర్మన్ మేడారామ లక్ష్మి, ఇన్నర్‌వీల్ ప్రెసిడెంట్ పద్మ, సెక్రటరీ లక్ష్మి, ప్రతిమ, శ్రీవల్లి తదితరులు మహిళల సమస్యలు, ఆదర్శప్రాయ జీవన విధానం గురించి మాట్లాడారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ఏజీ సామాజిక సేవా కార్యకర్త ప్రమీళారెడ్డి, నాట్యాచార్యులు దేవరకొండ కౌసల్య, బాడీ బిల్డర్ లావణ్య, లవోపా అధ్యక్షురాలు గూడూరు అనురాధ, స్ఫూర్తిదాయక సేవలందించిన నర్సు శ్రీలక్ష్మి తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ నిర్వాహకులు శ్వేత, అన్నపూర్ణ, డాక్టర్ దీప్తి, ,శ్యామల తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి

అనంతపురం టవర్‌క్లాక్: రానున్న ఎన్నికల్లో ముస్లిం, మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని ఐఎంఎం మహబూబ్ బాషా అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఐఎంఎం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్ బాషా మాట్లాడుతూ.. ముస్లిం, మైనార్టీలకు రాజకీయ పార్టీలు తీరని అన్యాయం చేశాయన్నారు. అనంతపురం జిల్లాలో అత్యధికం జనాభా ఉన్నప్పటికీ కనీసం గుర్తించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ముస్లీంలను గుర్తించి ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు కేటాయించాలన్నారు. లేని పక్షంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జాఫర్, షౌకత్, శర్మస్‌వలి, హఫీసాబ్, అబ్బుబకర్, సనవుల్లా, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారికి సన్మానం

అనంతపురం కార్పొరేషన్: ఫారెస్ట్ అధికారి బి.చంద్రశేఖర్‌ను మాజీ సైనికుల సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప, సైనికుల సంఘం నాయకులు సన్మానించారు. శనివారం ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఫారెస్ట్ అధికారి బి.చంద్రశేఖర్ పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సైనికుల సంఘం అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న, కెప్టెన్ ఉమామహేశ్వర రావు, కోశాధికారి తిమ్మారెడ్డి, అబ్దుల్ ఖాదర్, బీఏ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించండి



ప్రచారం నిర్వహిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: రాష్ట్రంలో మైనార్టీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని మేయర్ మహ్మద్ వసీం అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. శనివారం స్థానిక లక్ష్మీనగర్‌లోని హుస్సేనియా మసీదు సమీపంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మదపెద్దలను మేయర్ వసీం, మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు కలిశారు. మేయర్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మైనార్టీలకు ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. ప్రతి మైనార్టీ సోదరుడు గర్వపడేలా వారికి గౌరవం లభిస్తోందన్నారు. రాష్ట్రంలో హజ్ యాత్రకు వెళ్లే వారిపై అదనపు భారం పడకుండా ముఖ్యమంత్రి ముస్లింలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. అదేవిధంగా ఉర్దూకు రాష్ట్రంలో రెండో అధికార భాషగా గుర్తింపు కల్పించారన్నారు. అర్బన్ నియోజకవర్గంలో సైతం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి 9 మంది మైనార్టీలకు కార్పొరేటర్లుగా అవకాశం కల్పించారని తెలిపారు. ముస్లిం, మైనార్టీల అభివృద్ధికి తోడ్పడే వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రహంతుల్లా, ఇషాక్, కో-ఆప్షన్ సభ్యులు షంషుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొర్రపాడు హుస్సేన్, చింతకుంట మధు, రఫీ, నదీమ్ అహ్మద్, షేక్షావలి, కేఎం బాషా, కట్టుబడి తానీషా, కేఎం బాషా, హబీబుల్లా, జావీద్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే సందడి

అనంతపురం: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశంగా కృషి చేయాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు, తులనాత్మక అధ్యయన శాఖ విభాగాధిపతి డాక్టర్ ఎస్ఆర్ సదాశివారెడ్డి అన్నారు. ఎస్కేయూలోని తెలుగు విభాగంలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. పీజీ తెలుగు రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ జి.నరసింహన్ మాట్లాడుతూ.. జీవితంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో అకడమిక్ కన్సెల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర, డాక్టర్ తన్నీరు నాగేంద్ర, పరిశోధన విద్యార్థులు వీరనారప్ప, సంపత్‌కుమార్, హరీష్ కుమార్, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

వడ్డీ మాఫీకి నేటితో ఆఖరు

- అర్ధరాత్రి 12 వరకు చెల్లింపులకు అవకాశం
- ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసిన అధికారులు
- 30 రోజుల్లో రూ.10 కోట్ల పన్ను వసూలు



నగరపాలక సంస్థలో పన్ను చెల్లింపు కేంద్రం వద్ద పన్ను చెల్లిస్తున్న ప్రజలు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో ఇంటి, ఖాళీ జాగా పన్ను చెల్లింపులకు వడ్డీ రాయితీకి ఆదివారంతో గడువు ముగియనుంది. వడ్డీ మాఫీకి ఈ ఏడాది ఇదే చివరి అవకాశం. ఆదివారం చివరి రోజు సాయంత్రం 7 గంటల్లోపు పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ ఉంటుంది. ఆ తర్వాత అటువంటి అవకాశం ఉండదని నగరపాలక సంస్థ వర్గాలు చెబుతున్నాయి. ఈనెల 1 నుంచి ప్రభుత్వం వడ్డీ మాఫీకి అవకాశం కల్పించిన విషయం విదితమే. నగరంలోని 74 సచివాలయాల పరిధిలో 59,211 అసెస్‌మెంట్‌దారులు ఉన్నారు. ఈ అసెస్‌మెంట్లకు గానూ రూ.31.87 కోట్ల పన్ను చెల్లించాల్సి ఉంది. వడ్డీ మాఫీ ప్రకటించినప్పటి నుంచి నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ ప్రత్యేక దృష్టి సారించారు. కమిషనర్ ఆదేశాలతో అదనపు కమిషనర్ శ్రీహరిబాబు పర్యవేక్షణలో ఆర్‌ఓలు సతీష్, సుజాత, ఆర్‌ఐలు మురళీ, వేణు, పద్మావతి, బాబు, సచివాలయ అడ్మిన్లు, తదితరులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వీటితో పాటు ఆటోల ద్వారా ప్రచారం చేయించారు. ఈనెల 1 నుంచి ఇప్పటి వరకూ ఇంటి, ఖాళీ జాగా పన్ను రూ.10 కోట్ల మేర వసూలైంది. కమిషనర్ ప్రత్యేక చొరవతో ఏళ్ల తరబడి పన్ను చెల్లించని మొండి బకాయిదారులు పన్ను చెల్లించారు. తద్వారా వారికి రూ.లక్షల్లో వడ్డీ మాఫీ అయ్యింది. ఈ ఏడాదిలో మొత్తం ఇంటి పన్ను రూ.31 కోట్లు వసూలైంది.

ఐదు కౌంటర్ల ఏర్పాటు

పన్ను చెల్లింపులకు ఆదివారం చివరి తేదీ కావడంతో నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకున్నారు. నగరపాలక సంస్థలోని పన్ను చెల్లింపు కేంద్రంలో ఐదు కౌంటర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. రెవెన్యూ, సచివాలయ అడ్మిన్లు అందుబాటులో ఉంటూ పన్ను వసూళ్లు చేపట్టేలా కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు పన్ను చెల్లించేందుకు అవకాశం ఉంటుంది.

నగరాభివృద్ధికి సహకరించాలి

పన్ను చెల్లింపులకు ఆదివారంతో గడువు ముగుస్తుంది. అసెస్‌మెంట్‌దారుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆస్తి, నీటి, ఖాళీ జాగా పన్ను, నీటి మీటర్ చార్జీలు, డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించాలి. నగరాభిభివృద్ధికి సహకరించాలి.
– మేఘ స్వరూప్, నగరపాలక సంస్థ కమిషనర్

ఈద్గా మసీదులో ఇఫ్తార్ విందు

అనంతపురం కల్చరల్: నగరంలోని ఈద్గా మసీదులో శనివారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్ తదితరులు పాల్గొన్నారు. ఉపవాసదీక్షలను స్ఫూర్తిదాయకంగా నిర్వహిస్తున్న అందరినీ అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక వ్యాధులపై అవగాహన కల్పించాలి

అనంతపురం మెడికల్: మానసిక వ్యాధులపై అవగాహన కల్పించి, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి వివక్ష తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. శనివారం మానసిక వైద్య విభాగం ఆధ్వర్యంలో సర్వజనాస్పత్రిలో ప్రపంచ మానసిక అసమతుల్యతా దినోత్సవం (బైపోలార్ డే) నిర్వహించారు. బైపోలార్ డే పోస్టర్‌ను సూపరింటెండెంట్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, మానసిక వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శారద, నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, తదితరులు పాల్గొన్నారు.

సబ్ పోస్టాఫీసు ప్రారంభం

అనంతపురం సిటీ: అనంతపురంలోని సిండికేట్ నగర్‌లో సబ్ పోస్టాఫీసు బ్రాంచ్ కార్యాలయాన్ని ఆ శాఖ ఎస్పీ హరిబాబు శనివారం ప్రారంభించారు. తపాలా సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా రన్‌ఫర్ జీసెస్



ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

అనంతపురం కల్చరల్: ఈస్టర్ పర్వదిన రాకను పురస్కరించుకుని 'రన్‌ఫర్ జీసెస్' ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. జిల్లాలోని పలువురు పాస్టర్లు ఆధ్యాత్మిక ప్రసంగీకులు క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్న కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య సాగింది. ఏటా గుడ్‌ఫ్రైడే అనంతరం దైవం పట్ల విశ్వాసాన్ని ప్రకటించడానికి చేపట్టే రన్ ఫర్ జీసెస్ కార్యక్రమం శనివారం ఉదయం స్థానిక కార్మియల్ మాత మందిరం వద్ద ప్రారంభమైంది. దైవ సేవకులు సీఎస్ఐ డివిజనల్ చైర్మన్ రెవరెండ్ బెనహర్‌బాబు, కార్యక్రమ కన్వీనర్ పాస్టర్ సంపత్‌విజయ్‌కుమార్, తిమోతి ప్రత్యేక ప్రార్థనలతో జీసెస్ రన్‌ను ప్రారంభించారు. ప్రార్థనా మందిరాల సంఘ కాపరులు జాషువా జహంగీర్, శ్యామ్‌సన్‌నాయక్, రెవరెండ్ మోజెస్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

భాస్కర్‌రెడ్డి సేవలు ఆదర్శం



డీఈఈ భాస్కర్‌రెడ్డిని సన్మానించిన పీఆర్ సబ్ డివిజన్ ఉద్యోగులు

అనంతపురం సిటీ: 'విధి నిర్వహణలో మీరందించిన సేవలు మాకు స్ఫూర్తిగా నిలిచాయి. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో మీ చొరవ, సాహసం మాకు ఆదర్శమయ్యాయని పంచాయతీరాజ్ సబ్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఉభయ జిల్లాలకు చెందిన పంచాయతీరాజ్ ఇంజినీర్ల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రాచంరెడ్డి భాస్కర్ రెడ్డిని ఉద్దేశించి పలువురు వక్తలు అన్నారు. స్వచ్ఛంధ ఉద్యోగ విరమణ (వీఆర్ఎస్) చేసిన భాస్కర్‌రెడ్డి పదవీకాలం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, పీఐయూ, క్వాలిటీ విభాగానికి చెందిన అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అధికారులు సన్మానించారు. పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులందరికీ గాడ్‌ఫాదర్‌గా నిలిచిన భాస్కర్‌రెడ్డి సేవలను కొనియాడారు. పీఐయూ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) చంద్రశేఖర్, డీఈఈలు గురుమూర్తి, శ్రీనివాసమూర్తి, ఏఈ పాండురంగారెడ్డి, క్వాలిటీ విభాగం ఈఈ మల్లికార్జున, డీఈలు భరత్‌కుమార్‌రెడ్డి, రాజేశ్వరరెడ్డి, ఏఈఈ కృష్ణజ్యోతి ఆధ్వర్యంలో వేర్వేరుగా సన్మానించారు. సబ్ డివిజనల్ ఉద్యోగులు సురేశ్‌రెడ్డి, మాధవి, జగన్నాథరెడ్డి, శ్రీదేవి, కవిత, ముత్యాలప్ప, శ్రీనివాసులు, వెంకటలక్ష్మమ్మ, మూర్తి పాల్గొన్నారు.

చంద్రబాబుకు రాజకీయ సమాధి తథ్యం



మాట్లాడుతున్న ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్ పీరా, ప్రధాన కార్యదర్శి బలరాం

అనంతపురం కార్పొరేషన్: కుల అహంకారి చంద్రబాబుకు రాజకీయ సమాధి కడుతామని వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్ పీరా, ప్రధాన కార్యదర్శి వనరాస బలరాం పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శింగనమల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజినేయులును టిప్పర్ డ్రైవర్‌గా సంబోధిస్తూ.. ఇటీవల మాజీ సీఎం చంద్రబాబు నాయుడు విమర్శించడం ఆయన దిగుజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. గతంలోనూ బడుగులను చులకన చేసి మాట్లాడారని గుర్తు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాన్య కార్యకర్తలైన వీరాంజనేయులు (శింగనమల అభ్యర్థి), ఈర లక్కప్ప(మడకశిర)కు అవకాశం కల్పించారన్నారు. సమావేశంలో ట్రేడ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కోదండ రామ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌస్, కార్యదర్శి రషీద్‌ఖాన్, ఫకృద్దీన్, గోవిందు, మహ్మద్ అలీ, దేవ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ IV
అనంతపురం
ఆదివారం ॥ 31-3-2024

వైరల్



ఆడపిల్లే అదృష్టదేవత

పైలట్ టీనా గోస్వామి ఆసక్తికరమైన వీడియోలను 'పైలట్ మమ్మీ' శీర్షికతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తుంటుంది. తాజాగా పోస్ట్ చేసిన ఒక బామ్మ వీడియో వైరల్‌గా మారింది. గ్రామీణత ఉట్టిపడే ఆహార్యంతో కనిపిస్తున్న ఒక బామ్మ అయోధ్య ధామ్‌కు వెళ్లే విమానంలోకి మెట్లకు నమస్కరిస్తూ ఎక్కింది. విమానంలో కనిపించిన పైలట్ టీనా గోస్వామిని ఆప్యాయంగా పలకరించింది. 'మన భారతీయ సనాతన సంస్కృతిలో ఆడపిల్ల.. మన లక్ష్మి' అంటూ టీనాను ఆశీర్వదించింది. బామ్మ కాళ్లకు గౌరవంగా నమస్కరించింది టీనా. రెండు మూడు రోజుల వ్యవధిలోనే ఈ వీడియో ముప్పై లక్షల వ్యూస్ దక్కించుకుంది. హృదయాన్ని హత్తుకునే ఈ వీడియో గురించి కామెంట్ సెక్షన్‌లో ప్రశంసలు వెల్లువెత్తాయి.

సంతకాన్ని జంతర్‌మంతర్ చేసినచో...

శూన్యంలో నుంచి కూడా కళను సృష్టించే నైపుణ్యం ఆర్టిస్ట్‌ల సొంతం. తాజా విషయానికి వస్తే... ఇండిగో ఫ్లైట్ అటెండెంట్ తెల్లకాగితంపై చేసిన సంతకాన్ని క్షణాల్లో అందమైన చిత్రంగా మార్చాడు రాబిన్ బార్. సంతకం నుంచి అప్పటికప్పుడు ప్రేయసీప్రియులను సృష్టించిన రాబిన్ బార్ ఇలాంటి అలాంటి ఆర్టిస్ట్ కాదు...రికార్డ్ హోల్డర్ స్పీడ్ పెయింటర్. జస్ట్...కొన్ని రోజుల వ్యవధిలోనే ఈ వీడియో క్లిప్ 21 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. రాబిన్ బార్‌పై నెటిజనుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి.



వీల్‌చైర్‌లో వచ్చాడు... విల్‌పవర్ చూపాడు



వీల్‌చైర్‌కు పరిమితమైన ఈ యువకుడు విల్ పవర్ మాత్రం ఎప్పుడూ కోల్పో లేదు. స్నేహితుల సహాయంతో వీల్‌చైర్‌లో నుంచి రిషికేష్‌లో బంగీ జంప్ చేశాడు. ఈ వీడియోతో ప్రపంచవ్యాప్తంగా నెటిజనుల మనసు దోచుకున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో 24 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. 'ఎవ్రీథింగ్ ఈజ్ పాసిబుల్ ఇఫ్ యూ డేర్' 'మోర్ పవర్ టు యూ, బాయ్'లాంటి కామెంట్స్ కనిపించాయి. చాలామంది హార్ట్ ఇమోజీలతో రియాక్ట్ అయ్యారు. గతంలో లెఫ్టినెంట్ కల్నల్ అవనీష్ బాజ్‌పాయ్ ఆర్టిఫిషియల్ లింబ్‌తో భటిండాలో 14,000 అడుగుల ఎత్తు నుంచి స్కైడైవింగ్ చేసిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది.

సెల్ఫ్-లవ్



వెనకటికి ఒక ఈగ ఇల్లలుకుతూ ఇంటి పనుల్లో పడి పేరు మరచిపోయిందట. చాలామంది మహిళలు ఇంటిపనుల్లో తలమునకలైపోయి తమ ఇష్టాలను మరచిపోతుంటారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రొఫెసర్ ఫల్గుణి గృహిణుల కోసం ఒక వీడియో చేసింది.

'మహిళలు తమ భర్త, పిల్లల కోసం ఇష్టమైన వంటకాలను తయారుచేసే వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయడం చూశాను. మరి మీ కోసం ఎప్పుడు తయారు చేస్తారు? మీ కుటుంబ సభ్యులకు నచ్చిన వంటకాల గురించి మాత్రమే కాదు మీకు నచ్చిన వాటి గురించి కూడా దృష్టి పెట్టండి' అంటూ తనకు బాగా నచ్చిన వంటకాన్ని తయారుచేస్తున్న వీడియోను ఫల్గుణి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఈ వైరల్ క్లిప్ 1.4 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఈ వీడియో క్లిప్ చూసి ఒక మహిళ ఇలా స్పందించింది... 'నీకు ఇష్టమైనది చేసి పెడతాను. ఏంచేయమంటావు అని అడిగింది అమ్మ. వెంటనే సమాధానం చెప్పలేకపోయాను. పెళ్లయిన తరువాత ఇంటిపనుల్లో పడి నాకు ఇష్టమైన వంటకం ఏమిటో కూడా మరిచిపోయాను. ఈ వీడియో చూసిన తరువాత సెల్ఫ్-లవ్ ప్రాముఖ్యత గురించి రియలైజ్ అయ్యాను'

ధోనీ... ఈసారి ఇలా కానియ్!



ఎం.ఎస్. ధోనీ కెప్టెన్సీష్ క్వాలిటీస్ మాత్రమే కాదు సరికొత్త హెయిర్ స్టైల్, సరికొత్త బైక్ కూడా నెటిజనులకు ఆసక్తికరమే. తాజాగా ధోని 'డూడుల్ వీ3 ' ఇ-బైక్ రైడింగ్ వీడియో వైరల్ అయింది. రోజుల వ్యవధిలోనే 1.3 మిలియన్‌ల వ్యూస్‌తో దూసుకుపోతుంది. ధోని రైడింగ్ వీడియోలు వైరల్ కావడం కొత్త కానప్పటికీ ఎకో-ఫ్రెండ్లీ మోడ్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్‌ను ప్రమోట్ చేసే ఈ మేడ్-ఇన్-ఇండియా ఎలక్ట్రికల్ సైకిల్ వీడియో నెటిజనులలో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది.

హాయి హాయిగా... కూల్ కూల్‌గా!

ఎలాంటి క్యాప్షన్ లేకుండా రమీజ్ అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన చెన్నై ఆటోడ్రైవర్ వీడియో 3 కోట్ల ఎనభై ఎనిమిది లక్షలకు పైగా వ్యూస్‌తో దూసుకుపోతోంది. 'ఏమిటీ ఆటోడ్రైవర్ స్పెషాలిటీ?' అనే విషయానికి వస్తే... ఎండాకాలంలో చెన్నైలో వేడి అంతా ఇంతా కాదు. ఈ వేడిని తట్టుకోవడానికి సదరు ఆటోడ్రైవర్ ఎకో ఫ్రెండ్లీ ఏసీ ఫ్యాన్‌ను తయారుచేసి తన ఆటోలో బిగించాడు. ఆటోడ్రైవరే కాదు ప్రయాణికులు కూడా హాయి హాయిగా కూల్ కూల్‌గా ప్రయాణిస్తున్నారు.



వద్దమ్మా.. తప్పూ!



ఈ మధ్య 'గైడింగ్ హ్యాండ్స్' అంటూ ఒక వీడియో వచ్చింది. అది వెక్కిరింత వీడియో. ఫోన్ చూసుకుంటూ తల ఎల్లవేళలా కిందకు దించి ఉండేవారిని చేయి పట్టి చేరవలసిన చోటుకు చేర్చే 'సహాయక చేతులను' భవిష్యత్తులో ఉపాధిగా చేసుకోవచ్చని అందులో చూపుతారు. అంటే అంధులను చేయి పట్టి నడిపించే వారికి మల్లే ఈ ఫోన్ బానిసలను చేయి పట్టి నడిపించి చార్జ్ తీసుకునే వ్యక్తులు భవిష్యత్తులో వస్తారన్న మాట. మనం ఫోన్‌కు శ్రుతి మించి ఎడిక్ట్ అయ్యామని చెప్పేందుకు ఈ వీడియో చేశారు. బండి మీద వెళుతూ ఫోన్ మాట్లాడితే ప్రమాదం అని ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ వినడం లేదు. కొందరు హెల్మెట్‌లో దూర్చి మరీ ఫోన్ మాట్లాడుతూ ప్రమాదం బారిన పడతారు. మరికొందరు హెడ్‌ఫోన్స్‌తో మాట్లాడుతూ వెనకొచ్చే వాహనాల హారన్ వినక ప్రమాదంలో పడుతున్నారు. మొన్నటి మార్చి 26న బెంగళూరు విద్యారణ్యపురలో ఒక మహిళ ఇలా ఫోన్ బిగించి కట్టి మాట్లాడుతూ ఒక వ్యక్తి కెమెరాకు చిక్కింది. అతను షూట్ చేసి ఇన్‌స్టాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యింది. అందరూ ఇలా చేయడం ప్రమాదం అన్నారు. ఈ ఎండల్లో ఫోన్ వేడెక్కి పేలినా ప్రమాదమే అని మరికొందరు హెచ్చరించారు. పోలీసులు ఏం చేస్తున్నారని కొందరు ప్రశ్నించారు. చివరకు వీడియో పోలీసుల వరకూ వెళ్లింది. బండి నంబర్ ఆధారంగా ఆ మహిళను గుర్తించి యలహంక ట్రాఫిక్ స్టేషన్ వారు 5 వేల రూపాయల ఫైన్ వేశారు. అవసరమా ఇదంతా?

హెల్త్



కుటుంబ సభ్యుల ఆరోగ్యం మీద పెట్టినంత శ్రద్ధ తమ విషయానికి వచ్చేసరికి మహిళలు గాలికి వదిలేస్తారు. కుటుంబ సభ్యులు కూడా అంతగా పట్టించుకోరు. దాంతో ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చి, అది తీవ్రరూపం దాల్చేవరకు ఎవరూ సీరియస్‌గా తీసుకోరు. అలాంటి సమస్యల్లో 'డీప్ వీన్ థ్రాంబోసిస్' ఒకటి. ఇది స్త్రీ, పురుషులిద్దరికీ వచ్చే సమస్య అయినప్పటికీ... మహిళల్లో రిస్క్ ఫ్యాక్టర్స్ ఎక్కువ. గర్భధారణ నుంచి హార్మోన్ల సంక్లిష్టతల వరకు అనేక అంశాలు డీప్ వీన్ థ్రాంబోసిస్‌కు దారితీస్తాయి. రక్తనాళాల్లో... ప్రధానంగా చెడు రక్తాన్ని తీసుకెళ్లే సిరల్లో రక్తం గడ్డకట్టడాన్ని 'డీప్ వీన్ థ్రాంబోసిస్' (డీవీటీ)గా చెబుతారు. ఈ సమస్యపై అవగాహన కోసం ఈ కథనం.

మహిళకు డీప్ వీన్ థ్రాంబోసిస్ చేసే చేటు!

డీప్ వీన్ థ్రాంబోసిస్ అనేది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. కాలి సిరల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. ఇంచుమించు ప్రతి 20 మందిలో ఒకరికి... వారి జీవితకాలంలో డీప్ వీన్ థ్రాంబోసిస్ బాధపెడుతుంది.

మహిళల్లోనే ప్రభావం చూపడానికి కారణాలు...

1. ప్రెగ్నెన్సీ : స్త్రీలలో ఈ సమస్య మరింత ఎక్కువగా కనిపించడానికి గల కారణాలలో గర్భధారణ ఒకటి. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం తర్వాత ఆరు వారాల వరకు ఈ ముప్పు ఉంటుంది. గర్భధారణ తర్వాత రక్తనాళాల్లో రక్తప్రవాహం కాస్త నెమ్మదించడం మామూలే. దాంతో రక్తం గడ్డ కట్టే అవకాశాలు పెరగడం.

2. గర్భసంచి బాగా సాగడం: దీంతో రక్తనాళాలపై ఒత్తిడి పడి రక్తం సాఫీగా ప్రవహించడానికి ఆటంకం కలుగుతుంది.

3. నోటి ద్వారా తీసుకునే గర్భనిరోధక మాత్రలు: వీటిల్లోని హార్మోన్లతో డీప్ వీన్ థ్రాంబోసిస్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. దాదాపు ప్రతి గర్భనిరోధక మాత్రలో ఈస్ట్రోజెన్, ప్రోజెస్టిన్ ఉండటంతో అవి రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టేలా చేసే అవకాశాలు పెరుగుతాయి. పైగా ఈస్ట్రోజెన్... కాలేయాన్ని ప్రేరేపించి... రక్తంలో ఉండే బ్లడ్ క్లాటింగ్ ఫ్యాక్టర్ రక్తం గడ్డకట్టేలా చేసే ఫైబ్రినోజెన్‌ను ఎక్కువగా స్రవింపజేస్తుంది. దీనికితోడు గర్భనిరోధక మాత్రల్లో వాడే కొన్ని రకాల కాంబినేషన్స్ పిల్స్ వల్ల ఈ ముప్పు మరింత పెరుగుతుంది. అందువల్ల గర్భనిరోధక మాత్రలు వాడే వారు డాక్టర్ సలహా మేరకే వాడాలి.

4. హార్మోనల్ రీప్లేస్‌మెంట్ థెరపీ: మెనోపాజ్ తర్వాత తీసుకునే హార్మోనల్ రీప్లేస్‌మెంట్ థెరపీలోని మందుల్లో ఈస్ట్రోజెన్, ప్రోజెస్టిన్ కాంబినేషన్ ఉంటుంది. ఈ ఈస్ట్రోజెన్ పైన పేర్కొన్న ప్రభావాన్నే చూపడంతో డీప్ వీన్ థ్రాంబోసిస్ ముప్పు పెరుగుతుంది. అందువల్ల ఈస్ట్రోజెన్ మందుల్ని చర్మానికి అంటించే ప్యాచ్‌ల రూపంలో ఇస్తే ఈ ముప్పు తగ్గుతుంది.

5. జీవనశైలి అంశాలు: శారీరక శ్రమ లేకుండా ఒకేచోట ఎక్కువసేపు కూర్చుని ఉండటం, స్థూలకాయం, పొగతాగడం వంటివి రక్తప్రవాహానికి ఆటంకం కలిగిస్తాయి. స్మోకింగ్ ద్వారా దేహంలోకి చేరే నికోటిన్ రక్తాన్ని గడ్డకట్టేలా చేస్తుంది.



వేర్వేరుగా లక్షణాల తీవ్రత...

డీప్ వీన్ థ్రాంబోసిస్‌లో రకరకాల లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఆ లక్షణాలన్నీ అందరిలోనూ కనిపించకపోవచ్చు. దానికితోడు లక్షణాల తీవ్రతలో కూడా మార్పులుండవచ్చు. కొందరిలో రక్తపు గడ్డ చిన్నదిగా ఉంటే కొందరిలో అసలు ఎలాంటి లక్షణాలూ కనిపించకపోవచ్చు. సమస్య దానంతట అదే సమసిపోవచ్చు కూడా.

కొన్ని సాధారణ లక్షణాలు...

- రక్తం గడ్డ కట్టినచోట చర్మం వాపు (ముఖ్యంగా కాలు, పాదం వంటివి)
- చర్మం ఎర్రబారడం, అక్కడ వేడిగా ఉన్నట్టు అనిపించడం
- ఒక్కోసారి చర్మంలోంచి రక్తనాళాలు కనిపించడం
- కాలిలో డీవీటీ ఏర్పడినప్పుడు కాలు బలహీనంగా ఉన్నట్లు అనిపించడం
- రక్తనాళాలు గట్టి పడడం

ఈ లక్షణాలు అకస్మాత్తుగా కనిపించినా లేదా కాలం గడుస్తున్న కొద్దీ తీవ్రత పెరుగుతూ పోతున్నా వెంటనే డాక్టర్‌కు చూపించాలి. కొన్నిసార్లు రక్తనాళంలో ఏర్పడ్డ ఈ గడ్డ (క్లాట్) రక్తప్రవాహంలో కొట్టుకుపోతూ, గుండె రక్తనాళాల్లోకి చేరి, గుండెస్పందనలను ఆపివేసే 'పల్మునరీ ఎంబాలిజమ్' అనే కండిషన్‌కు దారితీసే ప్రమాదం ఉంటుంది.



నివారణ...

- మంచి సమతులాహారం తీసుకోవడం అంటే పొట్టు తీయని కాయధాన్యాలు, ఆకుకూరలు, కాయగూరలు, తాజా పండ్లు తీసుకుంటూ బరువు పెరగకుండా చూసుకోవడం వంటి ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ముఖ్యంగా మహిళలు రోజుకు కనీసం 30 నిమిషాల వ్యాయామం చేయడం వల్ల రక్తప్రవాహం సాఫీగా మారి రక్తపు గడ్డలు ఏర్పడకుండా ఉంటుంది.
- తగినన్ని నీళ్లు, ద్రవాహారాలు తీసుకుంటూ ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉండటం.
- ఒకే చోట స్థిరంగా కూర్చుని ఉండకుండా కాసేపు నడక, స్ట్రెచ్చింగ్ వంటివి చేస్తూ ఉండటం.
- దూర ప్రయాణాలు చేస్తున్నప్పుడు అదేపనిగా వాహనంలో కూర్చుని ఉండకుండా తరచూ బ్రేక్ తీసుకోవటం.
- రక్తనాళాల్లో రక్తప్రవాహం సాఫీగా సాగేందుకు కంప్రెషన్ స్టాకింగ్ వంటివి వాడటం.
- గర్భం దాల్చిన మహిళల కుటుంబ సభ్యుల్లో డీప్ వీన్ థ్రాంబోసిస్ వచ్చిన ఆరోగ్య చరిత్ర ఉంటే ముందే డాక్టర్‌కు ఈ విషయాన్ని చెప్పడం మంచిది.

చికిత్స...

డీవీటీ వచ్చే అవకాశాలున్న వారు సపోర్ట్ స్టాకింగ్స్ / కంప్రెషన్ స్టాకింగ్స్ వాడటం.

రక్తాన్ని పలచబార్చే మందులైన యాంటీ కోయాగ్యులెంట్స్ వాడటం..

- **క్లాట్ బస్టర్స్ / థ్రాంబోలైటిక్స్ చికిత్స :** చిన్న పైప్ (క్యాథెటర్) ద్వారా రక్తం గడ్డకట్టిన చోటికి థ్రాంబోలైటిక్స్ అని పిలిచే మందును పంపి, రక్తపుగడ్డను చెదరగొట్టే ఔషధాల్ని వాడటం.



డాక్టర్ నరేంద్రనాథ్ మేడ,
కన్సల్టెంట్ వాస్క్యులార్ & ఎండో వాస్క్యులార్ సర్జన్

మెడి టిప్


చెవుల సంరక్షణ కోసం...!

చెవులను రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలివి...
- పల్లెటూళ్లలో వేసవి సెలవులు రాగానే ఈత నేర్చుకోవడం కోసం పిల్లలు నీటి కుంటలు, చెరువులకు వెళ్తుంటారు. చెరువుల్లోని మురికి నీరు చెవుల్లోకి చేరి ఇన్ఫెక్షన్లు రావచ్చు. అందువల్ల ఈత నేర్చుకోవాలనుకునే పిల్లలు పరిశుభ్రమైన నీళ్లలోనే దిగాలి.
- చెవులను శుభ్రం చేయడానికి కొందరు గోరువెచ్చగా కాచిన కొబ్బరి నూనె, ఆముదం చెవుల్లో పోస్తారు. ఇలా ఎట్టిపరిస్థితుల్లోనూ చేయకూడదు.
- అపరిశుభ్రమైన నీటితో తయారు చేసే ఐస్‌క్రీముల వంటివాటితో గొంతుకు సంబంధించిన ఇన్ఫెక్షన్లు వస్తాయి. అవే ఇన్ఫెక్షన్లు చెవులకూ సోకే ప్రమాదం ఉంది. కాబట్టి చెవి, గొంతు, ముక్కు... భాగాల్లో ఎక్కడ ఇన్ఫెక్షన్ కనిపించినా నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా పిల్లల విషయంలో ఈ జాగ్రత్తను మరింతగా పాటించాలి.

పై జాగ్రత్తలు పాటించాక కూడా... గులివి, చీము వంటి సమమస్యలతో పాటు... చెవిపోటు ఎక్కువగా వస్తున్నా, సరిగా వినిపించకపోయినా... వీలైనంత త్వరగా ఈఎన్‌టీ వైద్యనిపుణులను సంప్రదించాలి.

గుండె పెరగడం అంటే..?

గుండె పెరిగే సమస్యను ఇంగ్లిష్‌లో హార్ట్ ఎన్‌లార్జ్‌మెంట్ అనీ, వైద్య పరిభాషలో కార్డియో మెగాలీ అని అంటారు. నిజానికి ఇదేమీ వ్యాధి కాదు. కొన్ని ఇతర ఆరోగ్య సమస్యలు (మెడికల్ కండిషన్ల) కారణంగా కనిపించే ఒక లక్షణం. గుండె ఎందుకు విస్తరిస్తుందో, అందుకు కారణమయ్యే ఆరోగ్య సమస్యలేమిటో, దీని నివారణ, చికిత్స ప్రక్రియలను తెలుసుకుందాం.



రక్తాన్ని సరఫరా చేసే ఓ పంప్ లాంటిది గుండె. ఈ పంపు బలహీనమైనప్పుడు శరీరానికి అవసరమైన రక్తాన్ని సరఫరా చేయలేదు. ఈ పరిస్థితినే హార్ట్ ఫెయిల్యూర్ అంటారు. గుండెపై ఒత్తిడి పెరిగినప్పుడు గుండె విస్తరిస్తుంది. కొందరిలో ఈ పరిస్థితి తాత్కాలికం కాగా... మరికొందరిలో ఎప్పటికీ మందులు వాడటం, చికిత్స కొనసాగించడం అవసరం కావచ్చు. ఈ సమస్య తీవ్రమైనదా కాదా అన్నది గుండె పెరగడానికి కారణమైన అంశాన్ని బట్టి ఉంటుంది.

గుండె పెరగడం... రకాలు...

గుండె కాస్త పెరిగినప్పటికీ... ఒక దశ వరకూ అది మామూలుగానే పనిచేస్తుంది. ఒక దశకు చేరాకే అనర్థాలు కనిపిస్తాయి. గుండె పెరిగిన కారణాలూ, తీరును బట్టి ఇందులో కొన్ని రకాలు ఉంటాయి. అవి...

- డయలేటెడ్ కార్డియోమయోపతి కారణంగా గుండె పెరిగితే ఇందులో గుండె కింది గదులు (వెంట్రికిల్స్) రెండూ పెరుగుతాయి.
- అధిక రక్తపోటు కారణంగా గుండె ఎడమవైపు కింది గది మందంగా మారవచ్చు. ఇలా కండరం మందంగా మారి గుండె పెరగడాన్ని 'హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతి' అంటారు.
- ఒక్కోసారి ఏ కారణమూ లేకుండానే గుండెపెరగవచ్చు లేదా ఇతమిత్థంగా కారణం తెలియక పోవచ్చు. ఈ పరిస్థితిని ఇడియోపథిక్ డయలేటెడ్ కార్డియో మయోపతి అంటారు.

కారణాలు...


- గుండె కండరానికి ఇన్ఫెక్షన్ (మయోకార్డైటిస్) వచ్చేలా చేసే వైరల్ ఇన్ఫెక్షన్లు.
- గుండెకు ఉండే నాలుగు కవాటాల్లో ఏదైనా దెబ్బ తినడం వల్ల కొన్ని గదుల్లోకి రక్తం ఎక్కువగా వెళ్తా ఉండటం.
- గుండె చుట్టూరా ఉండే ఒక పొరలోకి ద్రవాలు చేరడం వల్ల ఇలా జరగడాన్ని పెరికార్డియల్ ఎఫ్యూజన్ అంటారు. దీన్ని ఎక్స్-రే ద్వారా కనుగొంటారు.
- రక్తహీనత వల్ల అన్ని అవయవాలకూ ఆక్సిజన్ తగినంతగా అందదు. అలా అందించే ప్రయత్నంలో గుండె మరింత ఎక్కువగా పని చేయాల్సి రావడంతో.
- మహిళల్లో గర్భధారణ సమయంలో గుండె పెరిగే కండిషన్ అయిన పెరిపార్టమ్ కార్డియోమయోపతి వల్ల.
- కార్డియాక్ అమైలాయిడోసిస్ అనే కండిషన్‌లో రక్తంలో అమైలాయిడ్ ప్రొటీన్ మోతాదులు పెరగడంతో (ఇందులో గుండె గోడలు మందంగా మారతాయి).
- దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో బాధపడేవారిలో
- థైరాయిడ్ గ్రంథి స్రావంలో అసమతుల్యతల వల్ల
- పల్మునరీ హైపర్‌టెన్షన్ అనే హైబీపీ ఉన్నవారిలో రక్తపోటు వల్ల గుండె మరింత ఎక్కువగా పనిచేయాల్సి రావడంతో గుండె కుడివైపు గదులు పెరగవచ్చు.
- మద్యం తాగేవారిలో లేదా మాదకద్రవ్యాలు తీసుకునేవారిలో దీర్ఘకాలంలో గుండె పెరిగే ప్రమాదం ఉంది.
- కొందరిలో జన్యు సమస్యల కారణంగా పుట్టుకతోనే గుండె, దాని విధుల్లో తేడాలు రావడంతో పాటు గుండె పెరగవచ్చు.

లక్షణాలు... ● శ్వాస సరిగా అందకపోవడం ● కాళ్ల / పాదాల వాపు ● బరువు పెరగడం (ముఖ్యంగా దేహం మధ్యభాగంలో... సెంట్రల్ ఒబేసిటీ) ● తీవ్రమైన అలసట ● కొందరిలో గుండెదడ లేదా గుండె లయ తప్పడం.

నిర్ధారణ పరీక్షలు: కొన్ని రక్తపరీక్షలు, ఛాతీ ఎక్స్-రే, సీటీ లేదా ఎమ్మారై స్కాన్, ట్రెడ్‌మిల్‌పై చేయించే స్ట్రెస్ పరీక్ష, అరుదుగా గుండె కండరాన్ని సేకరించి చేసే బయాప్సీ.

చికిత్స... గుండె పెరగడానికి కారణమైన అంశం ఆధారంగా చికిత్స చేస్తారు. ఉదాహరణకు... ● గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో అడ్డంకి ఏర్పడటం వల్ల వచ్చే కరోనరీ ఆర్టరీ డిసీజ్‌లో ఆ అడ్డంకి తొలగింపు ద్వారా. ● రక్తపోటును నియంత్రించే మందుల్ని వాడటం ద్వారా. ● గుండె కవాటాలలో లోపాల వల్ల గుండె పెరిగితే వాల్వ్‌లకు తగిన రిపేరు చేయడం లేదా శస్త్రచికిత్స ద్వారా. ● మద్యపానం లేదా మాదక ద్రవ్యాల వల్ల గుండె పెరిగితే ఆ అలవాటును మాన్పించడం ద్వారా.

ఇతర మందుల వాడకంతోనూ... కాళ్లవాపులు అధికంగా ఉన్నప్పుడు అధికంగా మూత్రం వచ్చేలా చేసే డై-యూరెటిక్స్‌తో ● రక్తపోటు పెరిగినప్పుడు యాంజియోటెన్సిన్ - కన్వర్టింగ్ ఎంజైమ్ ఇన్హిబిటార్స్, బీటా బ్లాకర్స్ వంటి మందులతో. ● రక్తాన్ని పలచబార్చే యాంటీ కోయాగ్యులెంట్స్‌తో. ● గుండె లయ తప్పినప్పుడు యాంటీ అరిథ్మియా డ్రగ్ అనే మందును వాడతారు. ● గుండె కొట్టుకోవడం ఆగితే ఇంప్లాంటబుల్ కార్డియోవెర్టర్ డీ ఫిబ్రిలేటర్‌తో తిరిగి గుండె కొట్టుకునేలా చేస్తారు. ● గుండె స్పందనల వేగం పెరిగినా లేదా తగ్గినా క్రమబద్ధం చేసే 'పేస్‌మేకర్' అమర్చడం ద్వారా. ● లెఫ్ట్ వెంట్రిక్యులార్ అసిస్ట్ డివైస్ (ఎల్‌వీఏడీ) అనే ఉపకరణాన్ని.. గుండెమార్పిడి శస్త్రచికిత్స అవసరమైన వారు తమకు సరిపడే గుండెకోసం వేచి చూస్తున్నప్పుడు... ● గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో అడ్డంకులు (బ్లాక్స్) చాలా ఎక్కువగా ఉన్నప్పుడు బైపాస్ శస్త్రచికిత్సతో... ● చివరి ప్రత్యామ్నాయంగా గుండె మార్పిడి (హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్) చికిత్సతో పరిస్థితిని చక్కదిద్దుతారు.



డా. కరుణాకర్ రాపోలు
ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్ట్